క్లుప్తంగా

యాదవ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న మండల అధ్యక్షుడు నర్సిములు

దుద్యాల్: అల్లిఖాన్ పల్లి గ్రామంలో అఖిల భారత యాదవ సంఘం గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేఖరయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా అనంతయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా బసప్ప, మల్లయ్య, కోశాధికారిగా రాములు కార్యదర్శులుగా మహేశ్, అంజిలయ్య, బాలప్పలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నర్సిములు మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లప్ప, నర్సిములు తదతరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



స్టడీమెటీరియల్‌ను అందజేస్తున్న వెంకటయ్య

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పీరంపల్లి గ్రామ ఫీల్డ్‌అసిస్టెంట్ జంబు వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండలం పీరంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకులాల్లో ప్రవేశాలు పొందేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అలివేలు, ఉపాధ్యాయులు పార్వతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే ఏదైనా సాధ్యమే

ఎస్‌ఐ విఠల్‌రెడ్డి



మెడల్స్ అందజేస్తున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, కరాటే మాస్టర్ సాయి

తాండూరు రూరల్: కష్టపడితే ఏదైనా సాధ్యమని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తాండూరు మండలం జినుగుర్తి గ్రామ శివారులోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు మెడల్స్ అందజేశారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రాంలో 6వ జాతీయ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జినుగుర్తిలోని గిరిజన సంక్షేమ వసతిగృహ విద్యార్థినులు 59 మంది మెడల్స్ సాధించారు. 29 గోల్డ్, 12-సిల్వర్, 9-బ్రౌన్, 2-గ్రాన్ చాంఫియన్ షిప్‌లకు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ జపాన్ బోటీకాన్ సీనియర్ కరాటే మాస్టర్ సాయి, ప్రిన్సిపాల్ వెంకటమ్మ, పీఈటీ మధురవేణి పాల్గొన్నారు.

జీఓ నంబర్ 60 అమలు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

తాండూరు టౌన్: జీఓ నంబర్ 60 అమలు చేయాలంటూ తాండూరు మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో మున్సిపాలిటీ విఫలమైందన్నారు. జీఓ నంబర్ 60 ప్రకారం రూ.26వేల జీతం చెల్లించాలన్నారు. అలాగే 8 గంటల పనిదినం, డబుల్‌బెడ్రూం ఇళ్లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రతా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాస్, యూనియన్ గౌరవాధ్యక్షుడు కె రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, ఉపాధ్యక్షుడు బి శ్రీనివాస్, వెంకటప్ప, లక్ష్మణ్, ప్రకాష్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఆలు

- మండలంలో పెరిగిన సాగు
- అందని ప్రభుత్వ సాయం
- వాతావరణం అనుకూలిస్తే దిగుబడులు ఎక్కువే



గోనె సంచుల్లో నింపిన ఆలు

మర్పల్లి: ఈ సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలాలు ఘణనీయంగా పెరిగాయి. ఖరీఫ్‌లో సాగుచేసిన పెసర, మినుము, కంది, పత్తి దెబ్బతిన్నాయి. దీంతో బావులు, బోర్లు కలిగిన రైతులు పాడైన పంటలను దున్నేసుకున్నారు. భూగర్భజలాలు అధికమవ్వడంతో 90 రోజుల్లో చేతికొచ్చే ఆలుగడ్డ సాగుపై రైతులు మక్కువ చూపారు. 3 నెలల క్రితం బావులు, బోర్లు కలిగిన రైతులు ఆలు పంట వేసేందుకు ఆగ్రా నుంచి క్వింటాల్ ఆలుగడ్డకు రూ. 2,200 వెచ్చించి విత్తనబస్తాలు తీసుకు వచ్చారు. వాటిని తమతమ పొలాల్లో వేశారు. విత్తనం ఖర్చు, పంట సాగుకోసం ఎకరాకు సుమారు రూ. 40 వేల వరకు ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

1800 ఎకరాల్లో..

మండల పరిధిలోని ఘనాపూర్, జంషాద్‌పూర్, మొగిలిగుండ్ల, కొంషేట్‌పల్లి, పంచలింగాల, నర్సాపూర్, తుమ్మలపల్లి, పట్లూర్, మర్పల్లి, వీర్లపల్లి, దామస్తాపూర్, బూచన్‌పల్లి, దామస్తాపూర్, వంటి గ్రామాల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా సుమారు 1,800 ఎకరాల్లో ఆలుగడ్డ పంట సాగుచేస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. ఎకరా పొలంలో ఆలు విత్తనంతో పాటు పంట సాగు కోసం రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, కలుపు మొక్కలు తీసేందుకు, పంట తీసే వరకు సుమారు రూ.40 వేల వరకు ఖర్చవుతుందని రైతులు అంటున్నారు. ఎకరా పొలంలో ఆశించిన మేరకు పంట దిగుబడి ఉంటే సుమారు 90 క్వింటాల్ వరకు వస్తుందని రైతులు తెలిపారు. పంట చేతికొచ్చి విక్రయించే సమయంలో క్వింటాల్ ఆలుగడ్డకు కనీసం రూ.1,000 అమ్మితే ఎకరాకు 90 వేల వరకు ఆదాయం వస్తుందన్నారు. దీంతో పంట సాగు కోసం చేసిన పెట్టుబడులు పోను ఎకరాకు రూ.50 వేల వరకు లాభాలు గడించ వచ్చంటున్నారు.

వాతావరణం అనుకూలించాలి

ముఖ్యంగా ఆలుగడ్డ సాగు ఆశాజనకంగా ఉండాలంటే వాతావరణం అనుకూలించాలి. పంట వేసిన 30 రోజుల నుంచి చలి తీవ్రత అధికంగా ఉండాలి. పంట సాగు ఎండ ముఖం పట్టక ముందే నీరు పారించాలి. డ్రిప్ ఉంటే అవసరం మేరకు నీరు అందజేయాలి. పంట సాగును ఎప్పటికప్పుడు పరిశీలించాలి. అవసరం మేరకు కీటక నాశన మందులను పిచికారి చేయాలి. అవసరం మేరకు ఎరువులు వేయాలి. 90 రోజుల్లో పంటను తీయాలి. 90 రోజుల తరవాత పంట తీస్తే ఆలుగడ్డకు రంధ్రాలు పడే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొన్నారు.

కరువైన ప్రోత్సాహం

10 సంవత్సరాల కిత్రం అప్పటి కాంగ్రెస్ పభుత్వం ఆలుగడ్డ సాగు చేసే రైతులను ప్రోత్సహించేది. ఎకరా పొలంలో ఆలుగడ్డ సాగు చేస్తే ఎకరాకు రూ. 1,800 ఉద్యాన శాఖ వారు సబ్సిడీగా ఇచ్చే వారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 10 సంవత్సరాలుగా ఆలుగడ్డ సాగు చేసే రైతులకు ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వడం లేదు. ఈ సంవత్సరం ఆశించిన మేరకు వర్షాలు కురువడంతో రైతులు ఆలుగడ్డ సాగు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహించక పోవడం బాధాకరమని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ఆలుగడ్డ సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహకంగా ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలని వేడుకుంటున్నారు.

మంచినీటి బోరుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతు చేసిన బోరు

బంట్వారం: మంచినీటి బోరుకు మరమ్మతులు చేయించండి అనే శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. కోట్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పనిచేయని బోరును మరమ్మతులు చేయించారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ దగ్గరుండి బోరును రిపేర్ చేయించారు. బోరు నుంచి మంచి నీరు రావడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

మెరుగైన విద్యా బోధన చేయాలి

ఎంఈఓ వెంకట్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకట్

దోమ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేయాలని ఎంఈఓ వెంకట్ తెలిపారు. గురువారం దోమ మండల పరిధిలోని శివారెడ్డిపల్లి, గూడూర్, దొంగఎన్కేపల్లి, రత్నా నాయక్ తండాతో పాటు అంగన్‌వాడీ పాఠశాలలను సందర్శించారు. అక్కడ పరిసరాలను, రికార్డుల ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించకుండా బోధనోపకరణాలనుపయోగించి పాఠాలు చెప్పాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టా లన్నారు. పదోతరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ మంచి ఫలితాల కోసం చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులకు, బాలింతకు, చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వీఆర్‌ఏ వారసుల అరెస్టు బాధాకరం

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శుభప్రద్ పటేల్



నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏ వారసులు

అనంతగిరి: వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగం ఇవ్వాలని నిర్వహించిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. వీఆర్‌ఏ వారసులను అక్రమంగా అరెస్టు చేయడం బాధాకరమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, బీసీ కమిషన్ మాజీ సభ్యులు, శుభప్రద్ పటేల్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఉద్యోగాలు ఇచ్చిందని, వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని జీవో 81, 85 తీసుకువచ్చిందని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 4న వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీఆర్‌ఏ వారసులు వెళ్తున్నక్రమంలో వారిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిని నిరసిస్తూ వీఆర్‌ఏ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వంగూరి రాములు పిలుపు మేరకు, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పూజారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏలను గుర్తించి దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 16వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తు చేశారు. వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని, వారికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. అనంతరం జిల్లా జేఏసీ అధ్యక్షుడు పూజారి శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తుందని, వారికి ఎందుకు నియామకాలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికై నా ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మైపాల్, జేఏసీ జిల్లా కార్యదర్శి సంగమేష్, జేఏసీ నాయకులు జనార్ధన్, శ్రీనివాస్, సంగమేష్, అశోక్, బంటు రమేష్, సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం



పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్యకు జ్ఞాపిక అందజేస్తున్న జీవమిత్ర ఫౌండేషన్ నిర్వాహకులు

కుల్కచర్ల: ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో జీవమిత్ర ఫౌండేషన్ నిర్వాహకులు భరత్‌కుమార్, ఉత్తమ్‌కుమార్ ఇసుకతో వేసిన పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రకృతికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు అందరూ సమష్టిగా ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, సహకార సంఘం సీఈఓ బక్కారెడ్డి, సొసైటీ డైరెక్టర్ కొండయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి మొండిచేయి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్



పరిగిలో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పరిగి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపించిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకొచ్చిన బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలకు చేసిందేమిలేదన్నారు. పేదలు ప్రభుత్వ విద్యపైనే ఆధారపడి చదువుతుంటే విద్యాభివృద్ధికి ఎక్కువగా నిధులు కేటాయించకపోవడంతో విద్యారంగం కుంటుపడుతుందన్నారు. రూ. 12,500 కోట్లతో విద్యారంగా సమస్యలు పరిష్కారం కావన్నారు. విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం



తాండూరు రూరల్: కరన్‌కోట్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న రాజ్‌కుమార్, తదితరులు



మోమిన్‌పేట: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కరన్‌కోట్ గ్రామం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎంపీటీసీ సభ్యులు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కరన్‌కోట్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలో మేజర్ గ్రామం కరన్‌కోట్ అని అన్నారు. ఈ గ్రామం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో కరన్‌కోట్ అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామంలోని బసప్ప ఇంటి నుంచి ఎండీ ఖాదీర్ ఇంటి వరకు రూ.15లక్షలతో సీసీరోడ్డు పనులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్, సునీల్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు రూ.2.35కోట్ల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు విడుదల అయ్యాయని ఆయన తెలిపారు. గురువారం అంరాధికలాన్, మొరంగపల్లి, మోమిన్‌పేటలోని అంబేడ్కర్ కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో మండలానికి రూ.2.35కోట్లు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, రూ.404కోట్లు ఎన్‌ఆర్‌ఇజీఎస్ నిధులు విడుదలయ్యాయన్నారు. ఈ నిధులను ఎస్సీ కాలనీల అభివృద్ధికే వినియోగించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రేషన్ కార్డు లేని వారు నిరంతరంగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఒక ఎకరా ఉన్న రైతులకు బుధవారం నుంచే రైతు భరోసా నిధులు జమ చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సిరాజొద్దీన్, సంగమేశ్వర్ గౌడ్, మాణయ్య, వెంకటయ్య, ఎజాస్, రవి, నర్సింలు పాల్గొన్నారు.

దోమలో..

దోమ: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, మాజీ సర్పంచులు గందెరాములు, కోళ్ల సురేశ్ పేర్కొన్నారు. గురువారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో గ్రామ కాంగ్రెస్ సీనియర్ నేత అంతిరెడ్డితో కలిసి సీసీ రోడ్డు పనులు, అండర్ డ్రైనేజీ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని, ప్రతి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాఫర్, బాల్‌రాజ్, రాములు, శేఖర్, భాస్కర్, ఇంతియాజ్, హైమద్, బషీర్, రమేశ్, కృష్ణ, మహేశ్, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

సేవ చేస్తేనే సంతృప్తి



కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

తాండూరు రూరల్: పేదలకు సేవ చేస్తేనే సంతృప్తినిస్తుందని ఎల్‌ఎస్‌ఆర్ యువసేన అధ్యక్షుడు లొంక నర్సిములు అన్నారు. గురువారం పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో శంకర్ కంటి ఆసుపత్రి, ఎల్‌ఎస్‌ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిములు మా ట్లాడుతూ.. ఇప్పటి వరకు తాండూరు ప్రాంతంలో 2500 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 300 మందికి కంటి ఆపరేషన్ చేయించారన్నారు. తను సంపాదించిన సంపదలో సగభాగం పేదల కోసం ఖర్చు చేస్తానన్నారు. మంబాపూర్‌లో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 50 మందికి ఆపరేషన్ కోసం హైదరాబాద్‌కు పంపిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి, నజీర్, శ్రీనివాస్, రాము, కిరణ్, ముజీబ్, ప్రకాశం, మైపూజ్, మహేష్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

మోమిన్‌పేట: సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ అరవింద్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఇజ్రాచిట్టంపల్లిలో కళాజాత బృందంచే అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్లకు మెసేజ్‌లు పంపించి లింక్‌లను ఓపెన్ చేయాలని సూచిస్తారన్నారు. లింకులను ఓపెన్ చేయగానే బ్యాంకులోని డబ్బు ఖాళీ అవుతుందన్నారు. సైబర్ నేరగాళ్లు ఏవిధంగానైనా డబ్బులను కొళ్లగొట్టొచ్చన్నారు. డబ్బులు బ్యాంకు ఖాతా నుంచి ఖాళీ అయిన వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని ఆయన సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించా లని సూచించారు. మద్యం సేవించి వా హనా లు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

శివ దీక్ష స్వీకరించిన స్వాములు

కొడంగల రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో శివస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం శివదీక్షా మాలాధారులు శివ లింగానికి గణపతి పూజ, సంకల్పం, రుద్రాభిషేకం, శివార్చన, శివాష్టకం, బిల్వాష్టకం, లింగాష్టకం, పంచాక్షరి స్తోత్రం, శివ అష్టోత్తర శతనామావళిలతో భక్తి పారవశ్యంతో పూజలు నిర్వహించారు. అంతకు ముందు వేకువజామున నిజలింగప్ప దేశ్‌ముఖ్ కుటుంబసభ్యులు శివలింగానికి రుద్రాభిషేకంతో పూజలు నిర్వహించారు. అనంతరం పార్వతమ్మ దేశ్‌ముఖ్ జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు శివస్వాములకు భిక్ష ఏర్పాటుచేశారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకన్నగౌడ్

బొంరాస్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ఏ ఎన్నికలు తలపెట్టినా సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ వెంకన్నగౌడ్ గ్రామస్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చారు. గురువారం మండల పరిషత్ సమావేశం మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో నిర్వహించే ఉపాధిహామీ పథకం పనులు, నర్సరీల నిర్వహణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లోని ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది నియామకాలు వంటి వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

ఇందిరమ్మ జాబితాలో అర్హులు..

గ్రామాల వారీగా గుర్తించిన ఇందిరమ్మ ఇండ్లు ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరి వారిగా వచ్చిన జాబితాను పునఃపరిశీలన చేసుకోవాలని కార్యదర్శులకు ఎంపీడీఓ సూచించారు. జాబితాలో ఎలాంటి సమస్యలు లేకుండా అర్హులకు అవకాశం ఉండేలా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండొద్దని, ఈజీఎస్ సిబ్బందికి ఖచ్చితమైన ఆదేశాలిచ్చారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హౌసింగ్ డిప్యూటీ ఈఈ చందర్, ఏపీఓ ఎలియాస్, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

9న వాలీబాల్ టోర్నమెంట్

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో 9వ తేదీన వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కె శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 10వేలు, రెండవ రూ. 5వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 8వ తేదీ లోపు టీంలను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9398352185, 9177333142, 9963109491 నంబర్లను సంప్రదించాలని కోరారు. కోట్‌పల్లి, పెద్దేముల్, బంట్వారం, మర్పల్లి, మోమిన్‌పేట మండలాల క్రీడాకారులు మాత్రమే టీంలను నమోదు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

- తాండూర్-వికారాబాద్ ప్రధాన రహదారి పరిస్థితి
- గుంతలు, మెట్టల దారితో తరచూ ప్రమాదాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



ధారూరు-రాంపూర్‌తండా మధ్యలో పాడైన ఆర్‌అండ్‌బీ రహదారి

ధారూరు: తాండూర్-వికారాబాద్ వయా ధారూరు, కేరెళ్లి ప్రధాన రోడ్డు పెద్ద పెద్ద గుంతలతో అస్తవ్యస్తంగా తయారైందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగటి పూట ప్రయాణం పరేషాన్.. రాత్రి ప్రయాణం భయాందోళనగా ఉంటుందని విచారం వ్యక్తం చేస్తున్నారు. అడుగడుగునా గుంతలతో ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు లేకపోలేదు. ఈ రోడ్డును ఫోర్‌లేన్‌గా మార్చాలని దశాబ్దాల తరబడి కోరుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. 2024, డిసెంబర్‌లో పునర్నిర్మాణం కోసం శంఖుస్థాన చేసిన ఇంతవరకు పనుల ప్రారంభంలో అతీగతీ లేదని వారు ఎద్దేవా చేశారు. జిల్లాలో ముఖ్యమంత్రి, శాసనసభ స్పీకర్ ఉన్నా అభివృద్ధిలో మాత్రం వెనుకంజలో ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గుంటలు, మెట్టల రోడ్డు వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రాణాలు సైతం హరీ అంటున్నా అధికారులకు, పాలకులకు పట్టదా? అని వారు ప్రశ్నించారు. ఓ నాయకుడు రోడ్డు నిర్మాణానికి రూ. 41 కోట్లు మంజూరు అయ్యాయని, మరో నాయకుడు రూ. 110 కోట్లు మంజూరు చేశారని చెబుతున్నారే తప్పా పనులు ఎప్పుడు ప్రారంభిస్తారంటే మౌనం వహిస్తున్నారని వారు విచారం వ్యక్తం చేశారు. ఈ రోడ్డుపై నిత్యం శాసనసభ స్పీకర్, తాండూర్ ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న వారికి ఈ రోడ్డు దుస్థితి తెలియదా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా శాసనసభ స్పీకర్ తగిన చొరవ తీసుకుని వెంటనే రోడ్డు పనులు ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు.